# సహ జీవనం

వాళ్ళు నలుగురు ఒకే రూంలో రెండేళ్ళుగా కల్సివండుకుతింటున్నారు. డిగ్రీ ఫైనల్ పరీక్షలు పూర్తయ్యాయి. ఈ రెండేళ్ళల్లో వారి మధ్య సాన్నిహిత్యం బాగా పెరిగింది. రెండురోజుల్లో రూంఖాళీచేసి ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోనున్నారు.

''మళ్ళీ మనం యిలా కల్సి జీవించడం సాధ్యపడుతుందా'' బియ్యం కడిగి పొయ్యిమీద పెడ్తూ ఎంతో బాధగా అన్నాడు లక్ష్మణ్.

''ఈ రెండేళ్ళ మధురమైనజ్ఞాపకాలే జీవితాంతం మనమనసుల్ని కలిపి ఉంచుతాయి'' అన్నాడు రాము కూరగాయలు తరుగుతూ, అతని కంఠంలోనూ విషాదం.

''రామూ! స్టూడెంట్ లైఫ్ ఈజ్ గోల్డెన్ లైఫ్ అన్నారు. మనం మాత్రం మన స్నేహాన్ని జీవితాంతం ఒక బంగారు కలగా పదిలపరుచుకోవాలి'' అన్నాడు శ్యాం అంట్లు కడుగుతూ. శ్యాం కళ్ళు చెమర్చాయి.

''శ్యాం! మన నలుగురిలో ఎవరికి ముందు ఉద్యోగం వచ్చినా మిగతా ముగ్గురికి సాయం చేయాలి. ఏదో ఒక పనిలో, ఉద్యోగంలో సెటిలయ్యేదాకా మనం నలుగురం పెళ్ళి వాయిదా వేయాలి''. రాజు బకెట్లో నీళ్ళుతెస్తూ ఉత్తేజంగా అన్నాడు.

''రాజూ! నాకు ఈ సంవత్సరమే పెళ్ళి చేయాలనుకుంటున్నారు మా అమ్మానాన్నా! ఎట్లా తప్పించుకోవాలి. అటు చూస్తే మేనపిల్ల. నాక్కూడా యిష్టమైన అమ్మాయి. నా కోసమనే లక్ష్మి పెళ్ళి వాయిదా వేస్తున్నారు'' అన్నాడు లక్ష్మణ్.

దాంతో నలుగురి మిత్రుల చర్చ పెళ్ళి మీదకు మళ్ళింది. చర్చలు చేస్తూనే తిని రూం ఊడ్చి గిన్నెలు కడిగి శుభ్రం చేసారు. ఐనా చర్చ తరగలేదు.

''మన నలుగురికి ఉద్యోగాలయేదాకా ఏఒక్కరూ పెళ్ళి చేసుకొనేది లేదు ఈ మాటకు కట్టుబడి మన స్నేహాన్ని చాటుకుందాం'' అన్నాడు రాజు పట్టుదలగా.

''రాజా! నీకు ఎంతయినా చదివించే తల్లిదండ్రులున్నారు. నాకేమో చదివించే వాళ్ళు లేరు, నాకు పీ.జీ. సీటు వస్తుందని నమ్మకమూలేదు. అటు చూస్తే పెళ్ళి చేసుకొంటే కట్నం పైసల్తో ఆటో కొనుక్కోవచ్చు అంటున్నారు'' అన్నాడు లక్ష్మణ్.

''లక్ష్మణ్! నువ్వు డిగ్రీ చదివి ఆటో నడుపుకుంటాననడం నాకు నచ్చలేదు'' అన్నాడు సీరియస్‌గా రాజు.

''ఏ పనైతేనేం ముందు కడుపు నింపే పని కావాలి. ప్రతి పనీ గౌరవనీయమైనదే. మా అమ్మా నాన్నా బట్టలుతకడం నీచవృత్తి అనుకుంటే ఆ వృత్తి ఎవరు చేస్తారు. ఆ మాటకొస్తే బట్టలుతకడంకన్నా ఆటోనడుపుకోవడం నయం అనిపిస్తుంది నాకు'' అన్నాడు లక్ష్మణ్.

"అయితే నువ్వు ఆటోనడిపిస్తే నీ భార్య బట్టలుతుకుతుందా?" అన్నాడు శ్యాం.

"అవును అందులో ఏం తప్పుంది శ్యాం? వేల ఏళ్ళ నుండి చేస్తున్న కులవృత్తి అది".

"లక్ష్మణ్! టెన్త్ చదివిన అమ్మాయితో మంది బట్టలు ఉతికించాలనుకోవడం నీకు సిగ్గు అనిపించడం లేదా?" రాము ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకు సిగ్గు? ఏ వృత్తి అయినా గౌరవనీయమైనదే" ఒక వృత్తి సమాజానికి అనవసరమైతే అదే అంతరిస్తుంది కదా" అన్నాడు లక్ష్మణ్.

"అసలు మన భార్యలు పని చేయడం ఎందుకు? వాళ్ళు పిల్లల్ని చూసుకుంటూ వచ్చిన వాళ్ళకు యింత చాయో, టిఫినో అందిస్తూ ఉంటే చాలు" అన్నాడు రాము.

"ఈ కాలంలో భార్యాభర్తలు యిద్దరు కల్సి పని చేస్తేనే కుటుంబాన్ని కాస్త మంచిగా పోషించుకోవచ్చు రామూ" అంటూ అభ్యంతరం చెప్పాడు రాజు.

"ఆడవాళ్ళు మనతో సమానంగా పని చేస్తే మన మాటవింటారా, బోలెడు గర్వం ఉంటుంది." అన్నాడు శ్యాం.

"అందరు అలా ఎందుకుంటారు శ్యాం. గర్వం ఉండేవాళ్ళు ఉద్యోగం చేయకపోయినా భర్త హోదా చూసి గర్వంగా ఉంటారు." అన్నాడు రాజు.

"అంటే నువ్వు ఉద్యోగం చేసే అమ్మాయినే పెళ్ళి చేసుకుంటావా రాజా" అన్నాడు శ్యాం.

"ఔను ఈ కాలంలో ఆడవాళ్ళకే ఉద్యోగాలు తొందరగా వస్తున్నాయి. అందుకని ఇస్తానని వస్తే నాకు ఉద్యోగం రాకపోయినా ఉద్యోగం చేసే అమ్మాయినే చేసుకుంటాను" ఇన్నాడు రాజు.

"మరి నువ్వెలాంటి అమ్మాయిని చేసుకుంటావు నీ భార్య ఉద్యోగం చేస్తానన్నా చేయనియ్యవా ఏంటి శ్యాం". అంటూ అడిగాడు లక్ష్మణ్.

"నేను పి.జి.,ఎమ్.ఫిల్ అయి ఉద్యోగం అయ్యాకే పెళ్ళి చేసుకొంటాను. నాలా పి.జి. చేసిన అమ్మాయినే చేసుకుంటాను .అయితే ఇల్లాలుగా యింట్లోనే ఉండాలి. ఉద్యోగం చేయనివ్వను" అన్నాడు శ్యాం.

"ఇది మరీ ఘోరం శ్యాం! నీ అంత చదువు చదవడానికి ఆ అమ్మాయికి కూడా ప్రభుత్వం, తల్లిదండ్రులు కల్సి నాలుగు లక్షలు ఖర్చు చేస్తే ఆ జ్ఞానాన్ని ఉద్యోగం చేయకుండా యింట్లో బంధిస్తే జాతి సంపద ఎంత వృధా అవుతున్నట్టో గమనించు" అన్నాడు రాజు.

"అసలు ఆడవాళ్ళు మగవాళ్ళలా వృత్తి ఉద్యోగాలు చేస్తే మంచిదా? ఇంట్లో యిల్లాలుగా ఉంటే మంచిదా? ఎట్లా అయితే కుటుంబం ఎక్కువ ఆనందంగా ఉంటుందో పరిశీలించాలి. ఈ సెలవుల్లో ఆ పని చేద్దామా?" అన్నాడు రాము.

ఆ మాటతో ఎంతోసేపు తర్జన భర్జనలు సాగాయి. చివరికి నలుగురు ఒక అంగీకారానికి వచ్చారు. నలుగురు నాలుగు రకాల కుటుంబాలను తమ చుట్టూరా ఉన్నవాళ్ళ నుంచి ఎన్నుకొని వారికి మనం పరిశీలన చేస్తున్నట్టు తెలియకుండా పరిశీలించి రిజల్టు వచ్చాక మెమోల కోసం కాలేజీకి వచ్చినపుడు చర్చించుకుందాం అనుకున్నారు. మనం యిప్పుడు కల్సి చూసే చివరి సినిమా అంటూ సెకండ్‌షోకి బయల్దేరారు.

రెండు రోజుల తర్వాత ఎంతో హృదయ భారంతో పరస్పరం వీడ్కోలు చెప్పుకుని ఎవరింటికి వారు బయలుదేరారు.

పి.జి. చేద్దామనుకున్న శ్యాంకు అనుకున్నట్లుగానే ర్యాంకు వచ్చింది. బి.ఇడి. వస్తే చేద్దామనుకున్నా లక్ష్మణ్‌కు నిరాశే మిగిలింది. రాజుకు యం.సి.ఏ. ఎంట్రన్సులో మంచి మార్కులు

వచ్చాయి. రాము కెమిస్ట్రీలో పి.జి. చేద్దామనుకుంటే లా లో సీటు వచ్చింది. నలుగురు మళ్ళీ తీరికగా కలుసుకొనే వీలు చిక్కలేదు.

నలుగురు దసరా తర్వాత ఒక ఫ్రెండ్ చెల్లెలి పెళ్ళిలో కల్సుకున్నారు. పెళ్ళయ్యాక విడిది యింట్లో ఒక రూంలో కూర్చున్నారు.

మనం అనుకున్న పరిశీలన అనుభవాలు కల్పించుకుందాం. అన్నాడు శ్యాం.

అవును అనుకున్నారు అందరు. మొదట రాజు బాగా చెప్తాడని రాజును చెప్పమన్నారు. రాజు తన పరిశీలనను యిలా చెప్పడం ప్రారంభించాడు.

"భార్యాభర్తలు యిద్దరు ఉద్యోగం చేసే రాం రెడ్డి-సువర్ణ కుటుంబాన్ని పరిశీలించాను. ఎంతో అన్యోన్యంగా ఉన్నారు. రాంరెడ్డి, అతని భార్య సువర్ణ యిద్దరు టీచర్లే. అతను స్కూలు నుంచి వచ్చాక యింటి వద్ద ట్యూషన్లు చెప్తాడు. ఆమె వంటపని చూసుకుంటుంది. అప్పుడప్పుడు రాంరెడ్డి కూడా వంటచేస్తాడు. వాళ్ళకు యిద్దరు పిల్లలు. పెద్దమ్మాయి గుంటూరు రెసిడెన్షియల్ కాలేజిలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. అబ్బాయి ఊళ్ళోనే ప్రయివేటు స్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. రాంరెడ్డి అన్నదమ్ములు, అక్కచెల్లెండ్లు అందరూ జీవితంలో సెటిలై ఎంతో బాగా బతుకుతున్నారు."

"శివ శంకర్-గౌరి ఇద్దరు చదువుకున్నవాళ్ళే. అతనికి ఎక్సైజు డిపార్టుమెంటులో ఉద్యోగం. ఆమె వేరే డిపార్టుమెంటులో టైపిస్టు. తొలికాన్పు అబ్బాయి పుట్టడంతోనే ఉద్యోగం మానేయమని భర్త రభస చేశాడు. మామూళ్ళు బాగా అందడంతో భార్య ఉద్యోగం చేయడం అనవసరం అనుకున్నాడు. ఆమె మానేసింది. ముగ్గురు పిల్లలయ్యారు. ఉచితంగా దొరకడంతో మొదలైన తాగుడు వ్యసనంగా మారి ఆరోగ్యం చెడిపోయింది. చీటికీ మాటికీ భార్యను కొడతాడు, తిడతాడు. నా సంపాదన నా యిష్టం అంటాడ ఈ బాధలు భరించలేక కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకోబోయింది. ఇరుగు పొరుగు కాపాడారు. ముగ్గురు పిల్లల్ని భర్త దగ్గరే వదిలి తల్లిగారింటికి పోయింది. తాను ఉద్యోగాన్ని వదిలేయలేదని, లీవు పెట్టానని, మెడికల్ బేస్‌లో, తనను మానవతాదృక్పథంతో తిరిగి ఉద్యోగంలోకి తీసుకొమ్మని అప్పీలు చేసుకుంది. ప్రస్తుతం టైపు ఇనిస్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తోంది. భర్తతో వేరుగా ఉంటే తనకాళ్ళపై ధైర్యంగా నిలబడి బతుకుతుంది."

ఇట్లా మరో రెండు కథలు చెప్పాడు రాజు. అందరి వంతయ్యాక లక్ష్మన్ వంతు వచ్చింది. లక్ష్మన్ ఇట్లా చెప్పడం ప్రారంభించాడు.

"భీమయ్య-రాజమ్మ వీళ్ళిద్దరు ఎక్కనించో కొంతకాలం కింద మా వూరికి వలస వచ్చారు. భార్య ఉండగానే అతను ఈమెను లేపుకొని వచ్చాడు. భీమయ్య పిట్టలు పడతాడు. రాజమ్మ చాపలల్లుతుంది. పిట్టలమ్మిన పైసల్తో తాగివస్తాడు. భార్యను తంతాడు. వాళ్ళ పిల్లలు తెల్లారి లేవగానే గిన్నె తీసుకొని ఘటోత్కచుల్లా అరుస్తూ చలి అన్నం కోసం భిక్షాటనకు బయల్దేరుతారు. పాత కాగితాలు ఖాళీసీసాలు ఏరుకొస్తారు. తాగడానికి పైసలు కావాల్సినప్పుడల్లా భార్యను పిల్లల్ని కొడుతాడు. బాధలు పడలేక తన్నులు తినలేక రాజమ్మ ఎదురు తిరిగితే, హిడింబి ముండ! ఎంత కొడితివే! నేను పోతున్నాను. ఎక్కడికోపోతాను. ఎట్లానైనా బతుకు" అని భార్యా పిల్లల్ని వదిలేసి వెళ్ళిపోయాడు. ఎటుపోయాడో తెలియదు. ఆరు నెలలుగా ఆమెనే కుటుంబాన్ని పోషిస్తున్నది. మొగుడు పోయాక రాజమ్మను తిట్టేవాళ్ళు, కొట్టేవాళ్ళు లేక వొళ్ళు నిగనిగలాడుతున్న ఆమెను చూసి ఆమెలా వలస వచ్చినవాళ్ళు ఎవరో మారు మనువు చేసుకుంటానని ఆశపడుతూ తిరిగారు.

తిడుక తట్టారు. చీపురు కట్టి చూపడంతో ఇక ఆమెనైపు ఎవరూ రావడం లేదు. హాస్టల్లో చేర్పిస్తాను. పిల్లల్ని చదివించు అని అడిగాను. హాస్టల్లో వాళ్ళకు పెడ్తారు నాకు ఎవరు పెట్టాలె. వాళ్ళ అడుక్కొస్తేనే ఇంత తిండి తింటున్నాను. అయినా మేము సదువుకుంటే ఉద్యోగాలెవలిస్తరు అంది రాజమ్మ.

"బుచ్చిరాజం-హేమలతలకు ఉద్యోగం లేక ముందు పెళ్లయింది. బుచ్చిరాజంకు ఉద్యోగం అయ్యాక హేమలతను ప్రయివేటుగా పరీక్షలు రాయించాడు. ఆమెను ఉద్యోగం చేయిమంటాడు. ఈ పిల్లలతో, వంటలో ఉద్యోగం చేయడం ఎలా సాధ్యం అని వాదిస్తుంది. తెచ్చిపెడుతుంటే తినడం గాదు. కష్టపడి సంపాదిస్తే తెలుస్తుందని ఈసడిస్తాడు. నీకు ఉద్యోగం వస్తుందనే లక్ష కట్న మిచ్చి చేశారు. నేను సంపాదించి పెడ్తే కూర్చుని తిందామనుకున్నావా! పెళ్లాం పిల్లలనైనా సాకలేనివాడికి పెళ్ళెందుకు! భార్యా పిల్లల్ని సాకడం భర్త బాధ్యత. తెచ్చిపెడ్తే వండిపెడ్తా అంతే అని వాదిస్తుంది. కొడుక్కోసం చూస్తూపోతే ముగ్గురు ఆడపిల్లలయ్యారు. బుచ్చిరాజం తల్లిదండ్రులు కూడా వాళ్ళతోనే ఉంటారు.

హేమలత తీరికను సుఖాన్ని కోరుకుంటుంది. "పరాయి మగాళ్ళ మధ్య ఉద్యోగం చెయ్యాలి అని కోరే నువ్వసలు మొగాడివేనా! పెళ్ళాన్ని పది మందిలో ఉద్యోగం చేయమని చెప్పడానికి నీకు సిగ్గులేదా!" అని హేమలత భర్తను తిడుతుంది.

ఇట్లా మరో రెండు కథలు చెప్పాడు లక్ష్మన్. మళ్ళీ చర్చలు చేశారు. భార్య ఉద్యోగం చేయాలా? వద్దా? భర్త కన్న ఎక్కువ చదివి ఉంటే కష్టమా? సుఖమా? అన్న చర్చలు ఎటూ తేలలేదు. చర్చల్లో ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి మరింత గట్టిపడ్డాయి తప్ప మారలేదు.

"కావ్యాలంకార శాస్త్రాలలో అష్టవిధ కన్యల్ని చెప్పారు గాని అష్టవిధ ఇల్లాల్లను గురించి చెప్తే జీవితానికి పనికొచ్చేది" అన్నాడు రాము.

రూమ్మేట్లు మళ్ళీ ఎప్పుడు కల్సుకుంటామో అనే బాధతో వీడ్కోలు తీసుకున్నారు.

పదేళ్ళు గడిచాయి. ఈ పదేళ్ళలో నలుగురికీ పెళ్ళిళ్ళయ్యాయి.

రాజు గారి భాగ్యరేఖ : భార్య ఉద్యోగం చేయలనుకున్న రాజు అనబడే బుచ్చిరాజంకు భాగ్యరేఖ భార్యగా దొరికింది. పి.జి. చదివింది. దొరికితే ఉద్యోగం చేస్తుంది అని పెళ్ళప్పుడు అన్నారు తల్లిదండ్రులు. ఇద్దరు పిల్లలయ్యాక భాగ్యరేఖ తిరగబడింది. "నిన్ను సాకడానికి పెళ్ళిచేసుకోలేదు. పెళ్ళాన్ని సాకలేనివాడివి పెళ్ళెందుకు చేసుకున్నారు" అని తిట్టిపోసింది.

"నీ పి.జి. చదువు కోసం నీ తల్లిదండ్రులు, సమాజం పెట్టిన లక్షల రూపాయల ఖర్చు నీళ్ళల్లో పోసినట్టేనా! అలాంటిదానికి ఈ ఇంట్లోపడి ఉండక చదవడం ఎందుకు!" అని తిడ్తాడు రాజు.

"ఎందుకా! నేను చదివింది మంచిమొగుడు దొరకడానికి. నేను ఎంత చదివితే అంతకన్నా ఎక్కువ చదివిన మొగుడ్ని చేస్తారని. అంతేగానీ మొగున్ని సాదడానికి, ఉద్యోగం చేయడానికి కాదు." అని కయ్యిమంటుంది. భాగ్యరేఖ.

నెల జీతం నాల్రోజులకే చాలదు. ఇరుగింట్లో, పొరుగింట్లో వారికి ఇవి ఉన్నాయి, అవి ఉన్నాయి అంటూ అవసరం లేనివన్నీ కొంటూ యిల్లు గుల్ల చేస్తుంది భాగ్యరేఖ.

"నువ్వు భాగ్యరేఖవి కాదే. నా పాలిట దరిద్రరేఖవి" అని తల బాదుకుంటాడు బుచ్చిరాజం.

"నువ్వు బుచ్చిరాజంవి కాదు. పిచ్చిరాజంవి. నాపాలిట తిండిపోతురాజువు" అని బదులు తీర్చుకుంటుంది భాగ్యరేఖ.

లక్ష్మణ్ ఆటో అక్సిడెంటయ్యాకలోన్ కోసం తిరిగి తిరిగి జీరాక్సు సెంటర్ పెట్టుకున్నాడు.

కాస్త బాగానే బతుకుతున్నారు. ఇద్దరు పిల్లలు. బట్టలుతుకుతుందనుకున్న భార్య లక్ష్మీదేవి. లక్ష్మీదేవిలా ముస్తాబవుతుంది గానీ యింటికడపదాటదు. "జీరాక్సు సెంటర్లో రోజూ కొన్ని గంటలైనా కూర్చో. నాకు వెలుసుబాటుగా ఉంటుంది" అంటాడు లక్ష్మణ్.

"అక్కడికి అందరు మగవాళ్ళు వస్తారు. ఆ మేన్‌రోడ్లో జిరాక్స్ సెంటర్లో నన్ను కూర్చోమననడానికి నీకు నోరెట్లావచ్చింది. ఈ పిల్లలతోనే వేగలేకపోతున్నా. నువ్వేం చేస్తావు. నేను అక్కడ కూర్చుంటే" అని ఎడాపెడా వాయిస్తుంది లక్ష్మీదేవి.

"పెద్దకులస్థులు కూడా ఈ మధ్య చీరెలకు గంజి పెడ్తున్నారు. స్టార్చితో చీరలు రోలింగ్ చేస్తున్నారు. బ్యూటీ క్లినిక్‌లు పెడ్తున్నారు. ఆపనైనా చేయి" అని అరుస్తాడు లక్ష్మణ్.

"పెండ్లాలను సుఖపెట్టుకోవాలనుకునే వాళ్ళున్నారుగానీ, ఇట్లా పనిచేయిమనేవాళ్ళెవరూ లేరు. నేను నీడకు కూర్చుండి రంగుతేలి తెల్లగా నున్నగా అయితే నీకు ఓర్వబుద్ధి అవడంలేదు. మల్లా మంది బట్టలు ఉతుకపోతాను. నాకేమీ సిగ్గు అని కాదు. నీకే పరువు తక్కువ అని కూడా నీకు తెలియకపోతే నేనేం చేయాలి. దేవుడో" అని వాడకట్టు అంతా విన్పించేటట్టు అరిచి శోకాలు పెడ్తుంది లక్ష్మీదేవి.

"నా కొంప ఆర్పడానికే నాకు నిన్ను తలగ్గట్టారే నిన్ను" అని చెయ్యెత్తుతాడు లక్ష్మణ్.

"నాతోనే ఈ యింట్లోకి లక్ష్మి వచ్చింది. నన్ను చేసుకోక ముందు నీకేముంది మట్టి?" అంటుంది లక్ష్మీదేవి వాతలు పెట్టినట్లు.

తనకు చదువుకున్న భార్యకావాలి గానీ భార్య ఉద్యోగం చేయకూడదు అనుకున్న శ్యాంకు పి.జి. చేసిన అరుధంతి దొరికింది. అత్తగారి తరపు నుండి ఎపుడూ ఏదో కావాలని కోరే శ్యాంతో మాటామాటాపెరిగి అలిగి పుట్టింటికి పోయి అరుంధతి మళ్ళీ నీ గడప దొక్కనంది. ఇంకా చిన్న చెల్లెలు పెళ్ళికుంది. ఉద్యోగం చేసి నాన్నకు సాయపడ్తానంది. ఆర్నెల్లకోసారి. యివే పోట్లాటలు ఆగలేదు. పిల్లలు పుట్టడమూ ఆగలేదు. ఇద్దరు పిల్లలయ్యాక వెసెక్టమీ చేసుకునేదాక అసలు దగ్గరకు రాకు అని అట్లా కూడా పుట్టింటికి పోయింది. గ్రూపు టు రాస్తే రాలేదు గానీ చదువుకున్న తెలివైన పిల్ల అని అమ్మలక్కలంతా కల్సి మండలాధ్యక్షురాల్ని చేశారు. ఆ తర్వాత మహిళా బ్యాంకు ఛైర్‌పర్సన్ అయింది.

ఇంట్లో వండిపెడ్తూ ఖరీదైన చదువుకున్న భార్య కబుర్లు చెప్తూ అన్నం తినిపిస్తుందనుకుంటే వంట చేసి ఆమెరాకకోసం భర్త భార్యలా ఎదిరి చూడ్డం శ్యాంకు తలకొట్టేసినట్టుగా ఉంది. రోజంతా కల్సి నువ్వు చెప్పేది నాలుగు పీరియడ్లుండదు. బోలెడు తీరిక. పనిమనిషి ఉండనే ఉంది. గ్యాస్‌మీద వంట చేయడం కూడా చాతకాక పోతే నీకేం చాచతనవుతుంది అని ఈసడిస్తుంది అరుంధతి.

ఇల్లాలు యింత టీ, టిఫిన్లు వచ్చినవారికందిస్తే చాలు. ఉద్యోగాలు చేయడం ఎందుకు అన్న రాము భార్య గీతాదేవిని ఉద్యోగం చేయాలని ఉబ్బించడం ప్రారంభించాడు. ఉద్యోగం కెక్కాక ఉప్పించడం ప్రారంభించాడు. భర్త బలహీనత కనిపెట్టి గీతాదేవి పోట్లాటైనప్పుడల్లా ఉద్యోగం మానేస్తానని అనేస్తుంది. అత్తమామలు యింటికొస్తే పదిరోజులు ఎర్న్‌లీవ్, షడేసి యింట్లోనే ఉండిపోతే లబోదిబోమన్నాడు రాము. అయితే నేను ఉద్యోగం చేయడమే కావాలో, అమ్మానాన్నలకు సేవలు చేయడమే కావాలో తేల్చుకో అంది గీత.

"నాన్నా! ఇక్కడ ఇల్లు యిరకాటంగా ఉంది. మీరు ఇంటివద్దే ఉండండి. నెలానెలా నేనే వస్తాను. డబ్బులు యిస్తాను. పల్లెటూరే మంచిది. అక్కడిగాలి, ప్రకృతి ఆరోగ్యకరమైనవి." అని మస్కాకొట్టాడు రాము. తల్లిదండ్రులకు అసలు విషయం తెల్సి వాళ్ళు వెళ్ళిపోయారు.

మరో నాలుగేళ్ళు గడిచాయి.

బుచ్చిరాజం , భాగ్యరేఖల బుజ్జి పుష్పవతైంది. చీరకట్టించే ఫంక్షన్‌కు పెళ్ళంత పెద్ద ఏర్పాట్లు కావాలంది భాగ్యరేఖ.

"నీ పి.జి. తెలివంత ఏ గంగలో పోయింది. చీర కట్టించే ఫంక్షనెందుకే" అన్నాడు బుచ్చిరాజం.

భాగ్యరేఖ భారతం చదవడంతో అటిలాగియిటులాగి దగ్గరి వాళ్ళను పిలుచుకొని ఫంక్షన్ పరిమితంగా జరపడానికి రాజీకుదిరింది. రిటైరైన రాంరెడ్డి-సువర్ణ దంపతుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించాలనుకున్నారు.

అట్లా రూమ్మేట్సు నలుగురు మిత్రులు ఆ ఫంక్షన్‌లో కలుసుకున్నారు. స్టూడెంట్ లైఫ్ ఎంత గోల్డెన్ లైఫో తలుచుకున్నారు.

బట్టలుతుకుతూ ఉంటుందనుకున్న లక్ష్మణ్ భార్య లక్ష్మీదేవి ఏపాటి అందంగా ఉంటుందిలే, బట్టలుతికే సోడానీళ్ళు, మురికి మీద పడి తలవెంట్రుకలు ఎర్రబడి చర్మం పగిలి ఎండిపోయినట్టుగా ఉంటుందనుకున్న భాగ్యరేఖ లక్ష్మీదేవిలా నిగనిగలాడుతున్న లక్ష్మిని చూసి అదిరి పడింది.

అరుంధతి పెళ్ళయినపుడు చీకేసిన మామిడి టెంకలా ఎండిపోయి ఉండేది అనుకుంటే ఎమ్.ఎల్.ఏ. అంత తేజస్సుతో అద్భుతమైన వర్చస్సుతో అందరిని ఆకర్షించడం చూసి భాగ్యరేఖ తౌడు బస్తాల మారిన తన ఆకారాన్ని చూసుకొని తానే బాధపడింది.

నలుగురు మిత్రులు రూమ్మేట్స్‌గా పద్నాలుగేళ్ళక్రితం విడిపోతూ చేసుకున్న చర్చలు గుర్తు చేసుకున్నారు. అనుకున్నదొకటి జరిగిందొకటి అని చర్చించుకున్నారు.

బుచ్చిరాజం ఎంతో గంభీరంగా విషాదంగా చర్చను ముగించాడు.

"జీవితంలో నేను చేసిన అతి పెద్దపొరపాటు పెళ్ళి చేసుకోవడం" అన్నాడు బుచ్చిరాజం.

సువర్ణ కలుగజేసుకొని అంది. "మీ అమ్మా నాన్నలు కూడా ఇలాగే అనుకుంటే మీరు పుట్టేవారా? పరస్పరం గౌరవించుకుంటే ఎలాంటి భార్యా భర్తల మధ్యనైనా సంసారం సుఖంగానే సాగుతుంది. రాజీపడి సర్దుకుపోవడమే సంసారంలోని అసలు రహస్యం. ఆదర్శ దంపతులుగా మీరు మమ్మల్ని భావించడంలో మేము ఆచరించిన రహస్యం కూడా ఇదే."

విన్నావా! అంటూ దంపతులు పరస్పరం అర్థోక్తిగా చూసుకున్నారు. ఆ చూపుల్లో వాకమనుకూలంగా మవ్వు రాజీపడి సర్దుకుపోవాలి అనే అర్థం ప్రతి ఒక్కరిలో కన్పించి ఆశ్చర్యపోయారు సువర్ణ - రాంరెడ్డి ఆదర్శ దంపతులు.

❀ ❀ ❀